
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
సోమవారం 21 ఏప్రిల్ 2025



రేపు జిల్లాకు మంత్రి నిమ్మల రాక

అరసవల్లి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు ఈ నెల 22న జిల్లాలో పర్యటించనున్నారు. ముఖ్యమైన నీటిపారుదల ప్రాజెక్టులను సందర్శించి, వాటి పురోగతిని సమీక్షిస్తారు. వంశధార ఎడమ కాలువ, హిరమండలం రిజర్వాయర్ పనులను పరిశీలిస్తారు. అనంతరం జడ్పీ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. ప్రాజెక్టుల నిర్వహణలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. మధ్యాహ్నం మీడియా ప్రతినిధులతో మాట్లాడిన తరువాత విజయనగరం వెళ్తారు.

మెగా డీఎస్సీ వచ్చింది

- నోటిఫికేషన్ విడుదలపై నిరుద్యోగుల్లో ఆనందం
- ఉమ్మడి జిల్లాలో భర్తీకానున్న 543 పోస్టులు
- పరీక్షకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు

నరసన్నపేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి):

మెగా డీఎస్సీకి ఎట్టకేలకు నోటిఫికేషన్ విడుదలైంది. బీఈడీ, డీఈడీ అభ్యర్థులు ఏడేళ్లుగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ తరుణంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు నాయుడు మాట నిలబెట్టుకున్నారు. సీఎంగా ప్రమాణం చేసిన తర్వాత తొలి సంతకం డీఎస్సీపై పెట్టారు. తాజాగా మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంతో నిరుద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో బీఈడీ, డీఈడీ పూర్తిచేసిన వారు సుమారు 23వేల మందికిపైగా ఉన్నారు. వీరంతా ఏడేళ్లుగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తు న్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో 543 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయనుంది. జిల్లా, మండల పరిషత్, మునిసిపాలిటీల్లో 458 పోస్టులు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో 85 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉన్నట్టు గుర్తించింది. మెగా డీఎస్సీ ద్వారా ఈ పోస్టులు భర్తీ చేయనుంది. ముందుగా ప్రకటించిన కంటే ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు అధికంగా భర్తీ చేయనుండడంతో డీఈడీ, బీఈడీ అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పరీక్షల కోసం సన్నద్ధమవుతున్నారు.



శ్రీకాకుళంలో డీఎస్సీకి సన్నద్ధమవుతున్న యువత

ఏడేళ్ల తర్వాత..

టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018 లో డీఎస్సీ పరీక్షలు నిర్వహించారు. 2019లో గత వైసీపీ ప్రభుత్వం నియామక ప్రక్రియ పూర్తిచేసింది. నాటి నుంచి ఐదేళ్ల పాలనలో ఒక్క ఉపాధ్యాయ పోస్టుకూడా భర్తీ చేయలేదు. ఓటు బ్యాంకు రాజకీయాలకు తెరలేపేలా సార్వత్రిక ఎన్నికల ముందు గతేడాది ఫిబ్రవరి 9న డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. హడావుడిగా నోటిఫికేషన్ ఇవ్వడంపై కొంతమంది అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం కూడా అభ్యర్థులకు అనుకూలంగానే ఆదేశాలిచ్చింది. దీంతో డీఎస్సీ ప్రక్రియ నిలిచిపోయింది. ఈ పరిణామాలను యువగళం పాదయాత్ర సమయంలో నారా లోకేశ్ దృష్టికి అభ్యర్థులు తీసుకెళ్లారు. తాము అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ ప్రకటిస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు. అలాగే ఎన్నికల ప్రచారంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కూడా డీఎస్సీ ప్రకటిస్తామని నిరుద్యోగులకు హామీ ఇచ్చారు. ఈ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయగా.. ఏడేళ్ల తర్వాత తమ కల ఫలిస్తోందని (మిగతా 8వ పేజీలో..)

ప్రభుత్వ జిల్లా, మండల పరిషత్, మునిసిపాలిటీల్లో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు : 458

ఎస్జీటీ	113
ఫిజికల్ ఎడ్యుకేషన్	81
సాంఘికశాస్త్రం	70
ఇంగ్లిషు	65
తెలుగు	37
జీవశాస్త్రం	34
గణితం	33
భౌతికశాస్త్రం	14
హిందీ	11

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు : 85

ఎస్జీటీ	33
జీవశాస్త్రం	12
గణితం	13
ఇంగ్లిషు	12
భౌతికశాస్త్రం	10
సాంఘికశాస్త్రం	5

శుభపరిణామం



మాలాంటి వయసు మీరిన అభ్యర్థులకు డీఎస్సీ రాసే చాన్స్ ఉండదని అనుకున్నాం. కానీ ప్రభుత్వం వయో పరిమితి 44 ఏళ్లకు పెంచడం శుభపరిణామం. గత ఐదేళ్లు డీఎస్సీ కోసం ఎదురుచూశాం. సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ నేరవేర్చడం ఆనందంగా ఉంది.

-కోటపల్లి కోటిబాబు, జమ్ము, నరసన్నపేట

నాలుగేళ్లుగా



గత నాలుగేళ్ల డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తూ.. చదువుతున్నాం. ఇటీవల శాసనసభలో డీఎస్సీపై సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రకటనలు జారీ చేయడంతో ఆశలు చిగురించాయి.

- జె.పైడిరాజు, జలుమూరు

కల ఫలించనుంది



డీఎస్సీ పేరిట గత ప్రభుత్వం కాలయాపన చేసింది. ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని యువగళం పాదయాత్రలో నారా లోకేశ్‌కు అభ్యర్థించాం. ఆయన ఆనాడు మాట ఇచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టడం ఆనందంగా ఉంది. త్వరలో మా కల ఫలించనుంది.

- జగదీష్, నరసన్నపేట



నరసన్నపేటలో..

గొప్ప దార్శనికుడు చంద్రబాబు

- నవ్యాంధ్ర నిర్మాత.. అభివృద్ధి ప్రదాత సీఎం
- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు
- ఘనంగా టీడీపీ అధినేత జన్మదినం


అరసవల్లి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): 'నవ్యాంధ్ర నిర్మాత.. రాష్ట్ర అభివృద్ధి ప్రదాత.. గొప్ప దార్శనికుడు సీఎం చంద్రబాబు నాయు డు' అని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కొనియా డారు. టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు 75వ జన్మదినాన్ని పుర స్కరించుకుని ఆదివారం జిల్లావ్యాప్తంగా ఘనంగా వేడుకలు నిర్వ హించారు. శ్రీకాకుళంలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా పార్టీ అధ్యక్షుడు కలమట వెంకటరమణతో కలిసి కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు కేక్ కట్ చేశారు. ముందుగా టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఏడురోడ్ల జంక్షన్ వద్ద ఎన్టీఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు నివాళి అర్పించారు. ఎమ్మెల్యే శంకర్‌తో కలిసి 300 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. 'రాష్ట్ర భవిష్యత్తుకు దిశ, దశ నిర్దేశించే వ్యక్తి చంద్రబాబునాయుడు మాత్రమే. 45 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితం కలిగిన ఆయన నేటికీ నిత్య విద్యార్థి. ఆయన నేర్చుకుంటూ, అందరూ నేర్చుకునేలా తీర్చిదిద్దుతారు. ఆయన మార్గనిర్దేశంలోనే నేను కేంద్రమంత్రిగా ఎదిగాను. సమర్థ వంతంగా పని చేయగలుగుతున్నాను. ప్రజల కలల్ని నిజం చేయాలనే తపనతో పనిచేసే వ్యక్తి నిండు నూరేళ్లు బతకాలి. చంద్రబాబు అంటే ప్రజలందరికీ ఒక భరోసా. ఈ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలపాలన్న ఆయన కలలకు అందరూ సహకరించాలి. ఆయన బాటలో పయనించాలి' అని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



చంద్రబాబు బర్త్‌డే కేక్‌ను కట్ చేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, చిత్రంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు కలమట , ఎమ్మెల్యే శంకర్ తదితరులు

సీఎం పర్యటన ఖరారు

- 26న జిల్లాకు చంద్రబాబు రాక
- మత్స్యకార భరోసా పంపిణీకి ఏర్పాట్లు
- ఎచ్చెర్ల నియోజకవర్గంలో సభకు స్థల పరిశీలన



శ్రీకాకుళం/ఎచ్చెర్ల, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. శ్రీకాకుళం జిల్లా పర్యటన ఖరారైంది. ఈ నెల 26న ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఆయన పర్యటించనున్నారు. తీరప్రాంత మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఇచ్చే భృతిని రెట్టింపు చేసి మత్స్యకార భరోసా కింద లబ్ధిదారులకు రూ.20వేలు చొప్పున అందజేయనున్నారు. మత్స్యకారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకోనున్నారు. ఈ విషయాన్ని మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా సీఎం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని బుడగట్లపాలెం, జీరుపాలెం, కొవ్వాడ తదితర సముద్ర తీర గ్రామాలను ఆదివారం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఆర్డీవో కె.సాయిప్రత్యూష పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.గోపాల్, జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, మండల టీడీపీ అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, స్థానిక సర్పంచ్ అల్లుపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల : బుడగట్లపాలెం వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్, ఆర్డీవో సాయిప్రత్యూష

తాబేళ్లకు ఏమైంది?

- శ్రీకూర్మంలో కొన్ని మృత్యువాత
- పుష్కరిణి గోడ పక్కన కళేబరాలు
- ఆందోళనలో భక్తులు



శ్రీకూర్మంలో తాబేళ్ల కళేబరాలు

గార, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): శ్రీ మహావిష్ణువు రెండో అవతారమైన శ్రీకూర్మక్షేత్రంలో తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. గత రెండు రోజుల్లో సుమారు 15 తాబేళ్లు చనిపోయాయి. శ్వేతపుష్కరిణి గోడ పక్కన కాలిపోయి.. తాబేళ్ల కళేబరాలు కనిపించడంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. తాబేళ్లకు ఏమైందంటూ కలవరపడుతున్నారు. సుమారు 15 ఏళ్ల కిందట ఈ క్షేత్రంలో తాబేళ్ల కోసం పార్కు ఏర్పాటు చేశారు. తాబేళ్ల సంరక్షణను దేవాలయ అధికారులు పర్యవేక్షించేవారు. కొన్నాళ్ల కిందట కొత్తగా తాబేళ్ల పార్కు నిర్మించారు. తాబేళ్ల నిర్వహణ బాధ్యతను శ్రీకాకుళానికి చెందిన గ్రీన్‌మెర్సీ స్వచ్ఛంద సంస్థకు అప్పగించారు. తాబేళ్లకు ఆహారం, నీరు, తదితర నిర్వహణ కోసం ఈ సంస్థకు ప్రతి నెలా రూ.24వేలు ఈ సంస్థకు చెల్లించేలా అధికారులు ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు ఆ సంస్థ స్థానికంగా ఒక (మిగతా 8వ పేజీలో..)

భక్తిశ్రద్ధలతో ఈస్టర్

8లో

పూర్తిస్థాయిలో అందని రేషన్

- ఆందోళనలో లబ్ధిదారులు
- డీలర్లదే బాధ్యత అంటున్న అధికారులు


8లో

మొక్కల పేరుతో.. మెక్కేశారు!

- 25 ఎకరాల్లో ఔషధ మొక్కలు కనుమరుగు
- రూ.లక్షలు వ్యయమైనా నెరవేరని లక్ష్యం
- మందస అటవీ పరిధిలో అక్రమాలపర్వం



మందస అటవీ రేంజ్ పరిధిలోని హొన్నాళి బీట్‌లో సుమారు 25 ఎకరాల్లో ఔషధ మొక్కలు నాటిన సందర్భంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం ఇది. దీనిపై పూర్తి మొక్కలు, ఇతర వివరాలు ఉన్నా.. ఇక్కడ ఒక్క మొక్క కూడా కన్పించకపోవటం విడ్డూరంగా మారింది.



హొన్నాళి అటవీ రేంజి పరిధిలోని ఔషధ మొక్కల నాటిన ప్రాంతం ఇది. గతంలో లక్షల నిధులు వెచ్చించి ముళ్లపొదలు తొలగించి శుభ్రం చేసి మొక్కలు నాటినా నేడు ఒక్క మొక్క కన్పించకపోగా.. మళ్లీ అటవీ ప్రాంతంలా దట్టమైన ముళ్లపొదలతో నిండిపోయింది.


హరిపురం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి):

కాశీబుగ్గ అటవీ రేంజ్ పరిధిలో మందస సెక్షన్ హొన్నాళి బీట్‌లో కొన్నేళ్ల కిందట సుమారు 25 ఎకరాల్లో ఔషధ మొక్కలను నాటారు. హొన్నాళి గ్రామానికి చెందిన కూలీలతో మొక్కలు నాటి సంరక్షించేందుకు రూ.లక్షల్లో ఖర్చు చేశారు. కానీ ప్రభుత్వ లక్ష్యం మాత్రం నెరవేరలేదు. నేడు ఒక్క మొక్క కూడా అక్కడ కన్పించని దుస్థితి నెలకొంది. మొక్కల పేరుతో నిధులు మెక్కేశారనే ఆరోపణలు ఉన్నాయి. 2015-16లో జాతీయ ఔషధ మొక్కల నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈ మొక్కలు నాటేందుకు సిద్ధం చేశారు. దీనికిగాను ప్రత్యేక యంత్రాలతో ముళ్లపొదలు చెట్లు తొలగించి శుభ్రం చేశారు. 25 ఎకరాల బౌండరీ చుట్టూ కందకం తవ్వించారు. 11,110 ఔషధ మొక్కలు నాటారు. మొక్కకు మొక్కకు మూడు మీటర్లు చొప్పున దూరంతో ఏగిస, నేరేడు, మారేడు, ఉసిరి, వంటి నాలుగు రకాల మొక్కలు నాటారు. మొక్కలు చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. కానీ అవేవీ నేడు కనిపించడం లేదు. కంచెతోపాటు మొక్కలు సంరక్షించేందుకు సుమారు రూ.5లక్షలకు పైగా ఖర్చుయినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. కాగా క్షేత్రస్థాయిలో మాత్రం మొక్కల్లేవు. దీంతో మొక్కలేవి అని అడుగుతున్న జిల్లాస్థాయి అధికారులకు.. జంతువులు, పశువులు తినివేశాయని కొంతమంది సిబ్బంది చెబుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

నిర్లక్ష్యంతో.. కనుమరుగు..

లక్షల వ్యయం ఖర్చుతో స్థలాన్ని సిద్ధం చేసి కందకం తవ్వించి మొక్కలను సంరక్షించాల్సిన సమయంలో అధికారులు నిర్లక్ష్యంతో వదిలేశారు. దీంతో మొక్కలు ఎండకు ఎండి చనిపోయాయి. ఎక్కడో ఉన్న కొన్ని మొక్కలు సైతం జంతువులు, పశువులు గొర్రెలకు మేతగా మారి కనుమరుగయ్యాయి. రికార్డుల్లో సంరక్షణ పేరుతో నిధులు ఖర్చుయినా క్షేత్రస్థాయిలో పనులు జరగలేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారి నిధులు పక్కదారి పట్టాయి.

క్షేత్రాన్ని పరిశీలిస్తాం..



హొన్నాళి ఔషధ మొక్కల క్షేత్రాన్ని పరిశీలిస్తాం. మొక్కల పునరుద్ధరణ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి చర్యలు తీసుకుంటాం. నిధులు లేమితో గతంలో సంరక్షణ చర్యలు తీసుకోలేకపోయినట్లు తెలిసింది. ప్రస్తుతం దీనిపై దృష్టి సారించి మరింత సంరక్షణ చర్యలు తీసుకొని అటవీప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం.

-మురళీకృష్ణం నాయుడు, ఎఫ్ఆర్వో, కాశీబుగ్గ

రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు కృషి

● జిల్లా వ్యాప్తంగా ఘనంగా జన్మదిన వేడుకలు

రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు అన్నివిధాల కృషి చేస్తున్నారని టీడీపీ శ్రేణులు, ఎమ్మెల్యేలు, వివిధ స్థాయిలో ప్రజాప్రతినిధులు తెలిపారు. ఆదివారం చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు.


రణస్థలం: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు


అరసవల్లి: రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండుశంకర్


కవిటి: రామయ్యపుట్టుగలో కేక్ కట్ చేస్తున్న విప్ అశోక్

●కవిటి, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి):మండలంలోని రామయ్యపుట్టుగలో ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ బి.అశోక్ సమక్షంలో కవిటి మండల టీడీపీ నేతలు కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మణిచంద్రప్రకాష్ పాల్గొన్నారు.

●అరసవల్లి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఏడురోడ్ల జంక్షన్‌లో 1000 మంది పేదలకు ఎమ్మెల్యే గొండు శంకర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. రక్తదాన శిబిరాలను నిర్వహించారు.కార్యక్రమంలో నాయకులు మాదారపు వెంకటేష్, అంబటి లక్ష్మీరాజ్యం, శంకర్, వెంకటరమణ, అందవరపు ప్రసాద్, పుప్పాల చిన్న మహాలక్ష్మి,భీమశంకరరావు, చిట్టినాగభూషణరావు, మూకళ్ల శ్రీనివాస్, పాపారావు, పీఎంజే బాబు, రమణయ్య పాల్గొన్నారు.

●రణస్థలం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి):స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు.కార్యక్రమంలో లంక శ్యామలరావు, సురేష్, మల్లేశ్వరరావు, రవి, చౌదరిబాబ్జీ, జగన్నాథంనాయుడు, ఆనందరావు, విశ్వక్సేన్, భానోజినాయుడు, మధుబాబు పాల్గొన్నారు.

●పాతపట్నం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి):పాతపట్నంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. పట్టణంలో ర్యాలీ చేపట్టి నీలమణి దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక ఆసుపత్రిలో రోగులకు, గర్భిణులకు, పిల్లలకు పండ్లు, రొట్టెలను పంపిణీచేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు, బీజేపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

●నరసన్నపేట/, జలుమూరు (సారవకోట), ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న విజన్ ఉన్న వ్యక్తి చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. నరసన్నపేట, సారవకోట మండలంలోని సవరడ్డపనస పార్టీ కార్యాలయాల్లో చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించారు. గొట్టిపల్లి తపోవన వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ పోగోటి ఉమామహేశ్వరి, నేతలు సాసుపల్లి కృష్ణబాబు, కింజరాపు రామారావు, తాళాభక్తుల గోవిందరావు, ధర్మాన తేజకుమార్, కత్తిరి వెంకటరమణ పాల్గొన్నారు.

●ఎచ్చెర్ల, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఎస్ఎంపురంలో సీఎం చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణ మూర్తి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం, నాయకులు చౌదరి అవినాష్, సంపతిరావు నాగేశ్వరరావు, సంపతిరావు గణపతిరావు, పొందూరు భీమారావు, గోపిన కృష్ణప్రసాద్, గొలివి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.


ఎస్ఎంపురంలో కేకును కట్ చేస్తున్న చౌదరి నారాయణమూర్తి


పాతపట్నం:కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


నరసన్నపేట:కేక్ చేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


సోంపేట: బారువ సముద్రతీరంలో చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నేవీ మాజీ ఉద్యోగి బలరాంనాయుడు

రైతులకు అండగా నిలబడతాం

● కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు


ఇచ్ఛాపురం: మాట్లాడుతున్న రామ్మోహన్‌నాయుడు

కంచిలి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణతో రైతుకు పనిభారం తగ్గి అధిక లాభాలు సాధించవచ్చని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు.ప్రభుత్వం రైతులకు అండగా నిలబడుతుందని చెప్పారు. ఆదివారం కంచిలి మార్కెట్ యార్డులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూ.1.50కోట్ల విలువ చేసే 236 వివిధ యంత్ర పరికరాలు పవర్ టిల్లర్లు, పవర్ వీడర్లు, బాటరీ స్ప్రేయర్లు, దుక్కియంత్రాలు పరికరాలను రూ.37.2లక్షల రాయితీపై రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వవిప్ బెందాళం అశోక్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్, జేసీ ఫర్మానా అహ్మద్ ఖాన్,ఆర్డీవో వెంకటేష్, జిల్లా వ్యవసాయాధికారి కె. త్రినాథస్వామి, డీఎస్పీ వెంకటప్పారావు, సీఐ మంగరాజు, జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, ఇచ్ఛాపురం ఏఎంసీ చైర్మన్ బి.మణిచంద్రప్రకాష్ పాల్గొన్నారు.

●సోంపేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యతఇస్తోందని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఆదివారం సోంపేటలో రూ.60లక్షల రూర్బన్ మిషన్ నిధులతో నిర్మించిన వ్యవసాయ గోదామును ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ప్రారంభించారు.

●ఇచ్ఛాపురం,ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి):నియోజకవర్గం రూపురేఖలు మారుస్తానని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఇచ్ఛాపురంలో అన్నిశాఖల అధికారులతో సమీక్షించారు. ఏఐబీ ప్రాజెక్ట్ ద్వారా కొత్తగా రూ.60కోట్లు మంజూరయ్యాయని, ఈ నిధులతో ప్రాజెక్ట్ పూర్తవుతుందని, దీంతో 23వార్డుల ప్రజలకు, ప్రధానంగా 1,2,3 వార్డుల ప్రజలకు తాగునీందుతుందని ప్రభుత్వవిప్ బెందాళం అశోక్ తెలిపారు. అనంతరం నిర్వహించిన గ్రీవెన్స్‌లో వినతిపత్రాలు అందజేశారు. కాగా 11వవార్డులో ఎంపీ నిధుల్లో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజచేశారు. వార్డులో తాగునీటి సమస్యపై కౌన్సిలర్ ఆశి లీలారాణి, మహిళలు మంత్రికి వినతిపత్రం అందజేశారు.మునిసిపాలిటీలో ప్రధాన సమస్యలు పరిష్కరించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరిరాజు రామ్మోహన్‌నాయుడుకు వినతిపత్రం అందజేశారు

తండ్యాం ఎత్తిపోతల పథకం పూర్తిచేయాలి

పొందూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తండ్యాం ఎత్తిపోతల పథకం పనులు పూర్తిచేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె. మోహనరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.అజయ్ డిమాండ్ చేశారు. ఆదివారం తండ్యాంలో రైతుసంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూవైసీపీ ప్రభుత్వం తండ్యాం ఎత్తిపోతల పథకాన్ని నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ఈపథకం పూర్తయితే తండ్యాం, కృష్ణాపురం, మలకాం, బాణాం, పొందూరుతో పాటు 15 గ్రామాల్లో ఐదు వేల ఎకరాలకు సాగునీరందుతుందన్నారు.

విపత్తుల్లో సేవాసంస్థలు కీలకపాత్ర పోషించాలి

సోంపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తుల సమయంలో స్వచ్ఛంద సంస్థలు, సేవాసంస్థలు కీలక పాత్ర పోషించాలని సోంపేట అగ్నిమాపక అధికారి సూరాడ మోహన్‌రావు తెలిపారు.ఆదివారం స్థానిక అగ్నిమాపక కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జీవీఎస్ మూర్తి, ఎల్ఎఫ్‌కే భాస్కర్, ఆర్.సింహాచలం, కేవీ రమణ, ఎంఎం దాత పాల్గొన్నారు.

శ్రీశ్రీ కళావేదిక ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్‌గా రఫీ

శ్రీకాకుళం కల్చరల్, ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి):శ్రీశ్రీ కళావేదిక సాహితీ పట్టాభిషేక మహోత్సవం కార్యక్రమానికి ఉత్తరాంధ్ర శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షుడు ఆర్.మహమ్మద్ రఫీని ఉత్తరాంధ్ర జిల్లాల ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు.ఈమేరకు శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు కొల్లి రమావతి ఒక ప్రకటన విడుదలచేశారు. ఈ మేరకు రఫీని వేమన కవితామయం ప్రతినిధి జంధ్యాల, శరత్‌బాబు, విజయలక్ష్మణ్, వాడాడ శ్రీనివాసరావు అభినందించారు.

రేపు కంచి విశ్వవిద్యాలయంలో ప్రవేశాలు

అరసవల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఆవరణలోగల గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్‌లో మంగళవారం కంచి విశ్వవిద్యాలయంలో ప్రవేశాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ ఒకప్రకటనలో పేర్కొన్నారు. ఈ స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియలో పాల్గొనేందుకు కంచి యూనివర్శిటీ వీసీ ఆచార్య గుళ్లపల్లి శ్రీనివాస్, అడ్మిషన్ల చైర్మన్ ఆచార్య కె.వెంకటరమణన్, ఫ్యాకల్టీ డీన్ డాక్టర్ డి.నాగేశ్వరరావు సిబ్బంది రానున్నారని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు

పర్లాకిమిడి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): గజపతి జిల్లాలో అన్ని చర్చిల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా చర్చిల్లో మత పెద్దలు ప్రత్యూష ఈస్టర్ ప్రార్థనలు చేశారు. క్రీస్తు సందేశాన్ని భక్తులకు అందించారు. అనంతరం క్రీస్తు సిలువతో ఊరేగించారు.

పర్లాకిమిడిలో వైద్యశిబిరం

పర్లాకిమిడి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి):స్థానిక బిజూ పట్నాయక్ కల్యాణ మండపంలో చైతన్య ఆంధ్రా సాహితీ సాంస్కృత సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కలెక్టర్ బిజయ్ కుమార్ దాస్ వైద్యానికి ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు రామమూర్తి, మహేష్, శ్రీధర్, రహిమ తులా పాల్గొన్నారు.

బయోవేస్టేజీకి కాలంచెల్లిన మందులు

● శ్రీకాకుళంలో రాష్ట్రంలోనే తొలిసారిగా అమలు


ఎక్స్‌పైర్ అయిన మందులను బయోవేస్టేజీకి అప్పగిస్తున్న డ్రగ్ కంట్రోల్ ఏడీ చంద్రరావు

శ్రీకాకుళం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మెడికల్ షాపుల నుంచి కాలంచెల్లిన (ఎక్స్‌పైర్ అయిన) మందులను ఇకపై బయోవేస్టేజీకి అప్పగించనున్నారు. ఈమేరకు శనివారం నుంచి జిల్లా ఔషధ నియంత్రణ మండలి అధికారులు రాష్ట్రంలో తొలిసారిగా శ్రీకాకుళంలో అమలుచేస్తున్నారు. ఇదివరకు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల నుంచి ఆసుపత్రి వ్యర్థాలను కాలుష్య నియంత్రణ మండలి ఆమోదించిన సంస్థలకు బయోవేస్టేజీని వేరుచేసి అప్పగించేవారు. కానీ ప్రైవేటు మందుల దుకాణాల్లో పాడైన మందులు, ఎక్స్‌పైర్ అయిన మందులను విసిరివేయడం లేదా, భూమిలో కప్పిపెట్టడం, డ్రైనేజీలో పారబోయడం, చెత్తలో పారబోయడం చేసేవారు. ఇకపై అలాకాకుండా ఆ మందుల వల్ల ప్రమాదాలు సంభవించకుండా వృథామందులను ప్రైవేటు ఆసుపత్రి వ్యర్థాల మాదిరిగానే గుర్తించి బయోవేస్టేజీకి అప్పగించేలా ఫార్మాసిస్టులకు జిల్లా ఔషధ నియంత్రణ సహాయ సంచాలకుడు చంద్రరావు ఆదేశించారు. ఈ మేరకు శనివారం శ్రీకాకుళంలో అన్ని మందుల దుకాణాల ఫార్మాసిస్టులతో సమావేశం నిర్వహించారు. హోల్‌సేల్ ఫార్మా, జనరిక్, పీసీడీ డిస్ట్రిబ్యూటర్ల నుంచి మిగిలిపోయిన మందులను సైతం బయోవేస్టేజీకి అప్పగించాలని ఆదేశించడంతోపాటు అమలుచేయించారు. జిల్లా కాలుష్యనియంత్రణ మండలి ఆమోదించిన రైన్‌బౌ సంస్థకు మెడికల్ షాపుల నుంచి కాలంచెల్లిన మందులను అప్పగించారు. ఇకపై ప్రతి దుకాణదారుడు ఇలానే అప్పగించాలని, ఎక్కడా పారబోయకూడదని, ఈ విధానం రాష్ట్రంలోనే తొలిసారిగా శ్రీకాకుళంలో అమలవుతుందని తెలిపారు.

మూడో సంతానానికి ప్రోత్సాహకం

● కుటుంబాలకు డబ్బులు, ఆవు, దూడల పంపిణీచేసిన ఎంపీ కలిశెట్టి


మూడో సంతానంగా ఆడబిడ్డకు జన్మనిచ్చిన మహిళకు రూ.50 చెక్‌ను అందజేస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

రణస్థలం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మూడో సంతానంగా ఆడ బిడ్డ జన్మించడంతో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ప్రోత్సాహకం అందజేశారు. మూడో సంతానంగా ఆడ బిడ్డ జన్మిస్తే రూ.50 వేలు, మగ బిడ్డ జన్మిస్తే ఆవు, దూడ ఆ కుటుంబానికి అందజేస్తానని అప్పలనాయుడు ప్రకటించిన విషయం విదితమే. ఈమేరకు ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాతర్లపల్లికి చెందిన పొన్నాడ వెంకటలక్ష్మి మూడో సంతానంలో ఆడ బిడ్డకు జన్మనివ్వడంతో రూ.50 వేలు చెక్‌ను నిఖిలనాయుడు కలిశెట్టి చారిటిబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపీ అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అందజేశారు. లావేరు మండలంలోని కొత్తకుంకాం గ్రామానికి చెందిన కుప్పిలి నాగమణి మూడో సంతానంలో మగబిడ్డకు జన్మనివ్వడంతో ఆమెకు ఆవు, దూడా అందించారు.కొవ్వాడ మత్స్యలేసం గ్రామానికి చెందిన మైలపల్లి శాంతమ్మకు ఆవు, దూడ కోసం చెక్‌ను అందజేశారు.

ఆదిత్యుని ఆదాయం రూ.4 లక్షల 75 వేలు

అరసవల్లి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కుటుంబసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు.వారికి ఆదిత్యుని ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలికారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి జ్ఞాపికను ఆలయ జూనియర్ అసిస్టెంట్ కావ్య అందజేశారు.కాగా ఆదివారం స్వామివారికి రూ.4,75,568ల ఆదాయంలభించింది. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.2,66,700లు, విరాళాల ద్వారా రూ.70,548లు, ప్రసాదాల రూపంలో రూ.1,38,320ల ఆదాయం లభించింది.

పూర్వ విద్యార్థుల కలయిక

ఇచ్ఛాపురం, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-92లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు.ఈసందర్భంగా పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు.

మెమో 57ను అమలు చేయాలి

గుజరాతీపేట. ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెమో 57ను తక్షణమే అమలు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సాధన కమిటీ జిల్లా కన్వీనర్ కె.శ్రీహరి డిమాండ్ చేశారు. ఆదివారం శ్రీకాకుళంలోని యూటీఎఫ్‌భవన్‌లో జరిగిన మెమో-57 సాధన సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57 ప్రాప్తికి అర్హత ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని కోరారు. 2004 ముందు నోటిఫికేషన్ వచ్చి కొన్ని అడ్మినిస్ట్రేటివ్ కారణాల వల్ల జాయినింగ్స్ ఆలస్యం అయినప్పటికీ పీఎఫ్ఆర్‌డీఏ చట్టం అమలుకు ముందే నోటిఫికేషన్ రావడంతో పాతపెన్షన్‌కు వారంతా అర్హులని తెలిపారు. సమావేశంలో జిల్లా కన్వీనర్లు బి.శ్రీను, కె. ప్రకాష్, ఎ.లక్ష్మణరావు, జి.చిన్నికృష్ణ, శివరాంప్రసాద్, జి.భాస్కరరావు, వాసుదేవరావు, బి.బాలాజీ, బి.సంజీవ్‌నాయుడు, టార్జన్ బాబు, ఎస్.భాస్కర్, డి.అనీల్‌బాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

బెల్లుపడలో మహామంత్రం యజ్ఞం

ఇచ్ఛాపురం,ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): బెల్లుపడలో పాంచాహ్నిక పంచకుండాత్మక శ్రీరామతారక మహామంత్రంయజ్ఞం ఘనంగా జరుగుతోంది.ఆదివారం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు పాల్గొని పూజలు నిర్వహించారు.

ఎల్లమ్మతల్లి ఆలయం ప్రారంభం


ఎల్లమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

కవిటి, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి):మండలంలోనికపాసుకుద్ది పంచాయతీలోని పుటియాదల ఏరియాలోగల ఎల్లమ్మతల్లి మండపం,ఆలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ప్రశాంత్‌పాడి బృందంప్రత్యేకపూజలు నిర్వహించింది. పుటియాదల ప్రాంత రైతులు, ప్రగడపుట్టుగకు చెందిన తెలగ కులసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఎల్లమ్మను దర్శించుకున్నారు. ప్రభుత్వ విప్ బి.అశోక్ మహిళలతో కలిసి కలశయాత్రలో పాల్గొని అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్.రామారావు కూడా దర్శించుకున్నారు. బీల ప్రాంతంలోపొలాల మధ్యలో సుందరంగా తీర్చిదిద్దిన ఆలయంలో ప్రతిష్ఠ మహోత్సవం జాతర మాదిరిగా నిర్వహించారు.

రొట్టవలసలో రామకోటి గ్రంథాల ఊరేగింపు


రామకోటి గ్రంథాలను ఊరేగిస్తున్న భక్తులు

సరుబుజ్జిలి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి):రొట్టవలస శ్రీరామానందా శ్రమంలో నిర్వహిస్తున్న శ్రీతారకరామ నామ మహాయజ్ఞంలో భాగంగా ఆదివారం రామకోటి ఊరేగింపు కార్యక్రమాన్నినిర్వహించారు. ఆశ్రమవ్యవస్థాపక గురుస్వామి తొత్తడి వెంకటరమణ ఆధ్వర్యంలో ఆనందాశ్రమంలో ప్రత్యేక స్తూపం ఏర్పాటుతోపాటు మహాయజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈనెల 23శ్రీరామ ప్రత్యేక భక్త బృందాల మహాయజ్ఞ ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఇప్పటికే ఏర్పాట్లు చేశారు.

స్పోర్ట్స్ కోటా పెంచడంపై హర్షం

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉద్యోగుల భర్తీలో స్పోర్ట్స్ కోటాను రెండు నుంచి మూడు శాతానికి పెంచడంపై ఏపీ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కోశాధికారి ఎంవీ రమణ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. ఇక నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ప్రతిభ చూపిన వారికి వెయిటేజీ ప్రాతిపదికన స్పోర్ట్స్ కోటా వర్తిస్తుందని తెలిపారు. మొత్తం 65 క్రీడాంశాల్లో పాల్గొన్న క్రీడాకారులు ఈ రిజర్వేషన్ వర్తిస్తుందని పేర్కొన్నారు.

నేటి నుంచి తరగతుల్లో ప్రవేశం

గుజరాతీపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరానికి విద్యార్థుల నమోదు పెంచడం, డ్రాపౌట్ల సంఖ్యను తగ్గించడానికి సోమవారం నుంచి మూడు రోజులపాటు విద్యార్థులకు నూతన తరగతుల్లో ప్రవేశం కల్పించనున్నట్లు డీఈవో ఎస్.తిరుమల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి తరగతి చదువుతున్న విద్యార్థులు తర్వాత తరగతుల్లో కొనసాగడం, అంగన్‌వాడీ నుంచి ప్రాథమిక పాఠశాలలకు, ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలకు ప్రవేశించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే 10 నుంచి 15 దీల్లో విద్యార్థుల గుర్తింపు, 16 నుంచి 20వ తేదీ వరకు సంసిద్ధులను చేసినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి 20 వేల మందికి పైగా పిల్లలు ప్రాథమిక తరగతుల్లో చేరుతున్నట్లు పేర్కొన్నారు.

ఉషోదయ కార్యవర్గం ఎన్నిక

కవిటి,ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): కవిటిలోని ఉషోదయ యువజన సంఘం కార్యవర్గాన్నిగౌరవాధ్యక్షుడు బి.చిట్టిబాబు అధ్యక్షతన ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎ.కృష్ణారావు, ఉపాధ్యక్షుడిగా బి.చక్రధర్, కార్యదర్శిగా పి.రుద్రయ్య, సహాకార్యదర్శిగా పి.ఉమాపతి, కోశాధికారిగా ఎం.ఆదినారాయణ, ఆర్గనైజింగ్‌కార్యదర్శి బి.అబ్బాయి, కల్చరల్ కార్యదర్శి ఎం.డిల్లేశ్వరరావు,క్రీడా కార్యదర్శి నవీన్‌కుమార్, మీడియా కన్వీనర్ సుదర్శన ఎన్నికయ్యారు.

పట్టుశాలి సంక్షేమ సంఘం..

అరసవల్లి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలోని పట్టుశాలిసంక్షేమ సంఘంకార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. నగర అధ్యక్షుడిగా గుంటుకు చంద్రశేఖర్, కార్యదర్శిగా పేకల రామకృష్ణ, ట్రెజరర్‌గా అల్లంశెట్టి మోహనరావు, ఉపాధ్యక్షులుగా అల్లంశెట్టి మహేశ్వరరావు, గుంటుకు రాంబాబు, మలిపెద్ది శివకుమార్, జాయింట్ సెక్రటరీగా మాడుగుల శ్రీనివాసరావు, బస్వా చక్రధరుడు, పేకల మురళి ఎన్నికయ్యారు.



నూర్పిడి యంత్రంలో షార్ట్‌సర్క్యూట్



దగ్ధమవుతున్న నూర్పు యంత్రం, వరి చేను

కోటబొమ్మాళి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): హరిశ్చంద్రపురం పంచాయతీ సాలిపేట గ్రామంలో ఆదివారం వరి నూర్పిడి యంత్రంతో షార్ట్‌సర్క్యూట్ కావడంతో ఇంజన్‌తో పాటు సమీపంలో ఉన్న వరి చేను కుప్పలు దగ్ధమయ్యాయి. మార్పు భూషణరావుకు చెందిన 1.30 ఎకరాల విస్తీర్ణంలోని వరిచేను కోతకోసి కుప్ప పెట్టి ఆదివారం నూర్పుకు సిద్ధమయ్యారు. నూర్పు ప్రారంభించిన కొద్ది సమయంలోనే మంటలు చెలరేగడంతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. హరిశ్చంద్రపురం గ్రామస్థుడు బల్లి అప్పలరాజుకు చెందిన ట్రాక్టర్, వరిచేను, పక్కన ఉన్న అవాల బారికివాడుకు చెందిన వరి గడ్డికుప్పలు దగ్ధమయ్యాయి. గ్రామస్థుల సమాచారం మేరకు స్థానిక అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చినప్పటికే నష్టం వాటిల్లిపోయింది. సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం జరిగిందని సంబంధిత అధికారులు అంచనా వేశారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



ఆర్టీసీ సిబ్బందితో ఆటో కార్మికుల వాగ్వాదం

పలాస, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): కేటీరోడ్ అప్పయ్యదొర విగ్రహం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో ధ్వంసం కాగా డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ప్రయాణికులతో వెళుతున్న ఆటోను వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ టి.నారాయణకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే ఆటో కార్మికసంఘ నాయకులు అక్కడికి చేరుకొని ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ సిబ్బంది, ఆటో కార్మికుల మధ్య వాగ్వాదం జరిగింది. కాశీబుగ్గ పోలీసులు అక్కడికి చేరుకొని ఇరువర్గాలను శాంతింపజేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని యాచకుడి మృతి

పలాస, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో గుర్తు తెలియని యాచకుడు ఆదివారం మృతి చెందాడు. రెండు రోజుల నుంచి రోడ్డుపై యాచన చేస్తూ అక్కడే నిద్ర పోయాడు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం మృతి చెందినట్లు స్థానికులు గుర్తించి కాశీబుగ్గ పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కోడిపందెం నిర్వాహకుల అరెస్ట్

సంతబొమ్మాళి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మర్రిపాడు సమీపంలో ఆదివారం కోడిపందెం నిర్వహిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు నౌపడ ఎస్ఐ నారాయణ స్వామి తెలిపారు. కోడిపందెం నిర్వహిస్తున్నారన్న సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.3210 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పశువుల అక్రమ రవాణాపై కేసు

పలాసరూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పలాస మండలం జాతీయ రహదారిలో ఆదివారం ఇచ్ఛాపురం నుంచి శ్రీకాకుళం వైపు బి.లక్ష్మణరావు అనే వ్యక్తి లారీలో పశువులను తరలిస్తుండగా తనిఖీ చేసి సీజ్ చేసినట్లు ఎస్ఐ చంద్రరావు తెలిపారు. దాబా వద్ద తనిఖీ నిర్వహిస్తుండగా అనుమానంతో లారీని నిలుపుదల చేసి పరిశీలించగా 7 దున్నపోతులను తీసుకెళ్తున్నట్లు గుర్తించామన్నారు.

అ'పూర్వ' కలయిక



నాటి ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

పలాసరూరల్,ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణతర్లాలో 1997-98లో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం నిర్వహించారు. పాఠశాల ఆవరణలోని జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలు వేసి నివాళి అర్పించారు. నాటి ఉపాధ్యాయులను సత్కరించి వారి ఆశీస్సులు అందుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనందం పొందారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, కె.సూర్యనారాయణ, గరుగు సింహాచలం, ఉపాధ్యాయులు పి.మురళి, బి.కుశరాజు, ప్రసాదరావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసన్నపేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఉర్లాం 33కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లోని 11కేవీ చోడవరం ఫీడర్ ఆర్‌డీఎస్ఎస్ పని నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ బాలకృష్ణ తెలిపారు. చోడవరం నుంచి గొనపపేట, ముద్దాడపేట, చెన్నాపురం, పారశెల్లి, రెల్లివలస, సుందరాపురం, చిక్కాలవలస తదితర గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయింత్రం 5 గంటలు వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

తప్పిన ముప్పు



పడిపోయిన చెట్టు కొమ్మ

నరసన్నపేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట పట్టణం దేశవానిపేట పశువులు ఆసుపత్రి, సచివాలయ ప్రాంగణంలో ఎండిన పెద్ద వృక్షం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఆదివారం చిన్నపాటి గాలికి కొమ్మ విరిగి రోడ్డుపై పడింది. అయితే సెలవుదినం కావడంతో సచివాలయం, పశువుల ఆసుపత్రి మూసి ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ చెట్టు కింద భవనాలు కూడా ఉన్నాయి. తక్షణం ఎండిపోయిన భారీ వృక్షాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

సీరియస్‌గా ప్రిపేరవుతున్నా



2015లో బీఈడీ చదివాను. ఇప్పటికే ఐదుసార్లు టెట్ రాశాను. 2018లో డీఎస్సీకి హాజర య్యాను. పోస్టులు తక్కువగా ఉండడంతో గత డీఎస్సీ సాధించలేక పోయాను. ఈసారి పోస్టులు తక్కువగానే ఉన్నప్పటికీ గతంలో చేసిన తప్పులను సవరించుకుంటూ పోస్టు సాధించాలన్న లక్ష్యంతో ప్రిపేర్ అవుతున్నాను.

-బగాది అనిత కుమారి, చిన్నరావుపల్లి, ఎచ్చెర్ల మండలం

ఉపాధ్యాయ పోస్టు సాధిస్తా



2013లో బీఈడీ పూర్తిచేశాను. 2018 డీఎస్సీలో 103 మార్కులొచ్చాయి. ఈసారి ఎలాగైనా పోస్టును సాధించాలన్న సంకల్పంతో చదువుతున్నాను. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయడం సంతోషంగా ఉంది. సీఎం చంద్రబాబుకి కృతజ్ఞతలు.

-సనాపతి శ్రీనివాసరావు, వేణుగోపాలపురం, లావేరు మండలం

నోటిఫికేషన్ ఇవ్వడం ఆనందదాయకం



డీఈడీ చేశాను. మూడేళ్లుగా డీఎస్సీ కోసం ఎదురుచూశాను. నోటిఫికేషన్ జారీ చేయడం శుభపరిణామం. పెళ్లి అయిన నుంచి ఎలాగైనా టీచర్ ఉద్యోగం సాధించాలనే తపనతో అత్తవారి గ్రామమైన నరసన్నపేటలో ఉండి ప్రిపేర్ అవుతున్నాను. సీఎం చంద్రబాబుకు థ్యాంక్స్.

-బర్ల సత్యవతి, నరసన్నపేట

మెగా డీఎస్సీ వచ్చింది

(ఐదో పేజీ తరువాయి)

నిరుద్యోగులు సంబర పడుతున్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రారంభం..

డీఎస్సీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు ప్రక్రియను ఆదివారం నుంచి విద్యాశాఖ ప్రారంభించింది. డీఈడీ చేసిన వారు మాత్రమే ఎస్జీటీ పోస్టులకు అర్హులు. స్కూల్ అసిస్టెంట్‌లకు సంబంధించి ఆయా మెథడాలజీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి. జూన్ 6 నుంచి జూలై 6 వరకు కంప్యూటర్ బేస్డ్ విధానంలో పరీక్షలను నిర్వహిస్తారు.

వయోపరిమితి 44 ఏళ్లకు పెంపు..

డీఎస్సీ అభ్యర్థులకు వయోపరిమితిని సడలిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం గరిష్ఠ వయోపరిమితి 42 ఏళ్లు కాగా, దానిని 44 ఏళ్లకు పెంచారు. 2024 జూలై1న కటాఫ్ తేదీగా నిర్ణయించారు. ఈ సడలింపు ఈ ఒక్క డీఎస్సీకి మాత్రమే వర్తిస్తుంది. దీంతో జిల్లాలో ఈ డీఎస్సీలో సుమారు 2 వేలమంది పరీక్షలు రాసేందుకు చివరి అవకాశం కలిగింది.

ఎస్సీ ఉపకులాలకు రిజర్వేషన్లు అమలు..

ఈ డీఎస్సీలో ఎస్సీ కులాల ఉపవర్గీకరణ ఆర్డినెన్స్-25 మేరకు రిజర్వేషన్లను అమలు చేయనున్నారు. దీని ప్రకారం మూడు ఎస్సీ గ్రూపుల విషయంలో 200 రోస్టర్ పాయింట్ల విధానాన్ని అవలంబించనున్నారు. దీంతో డీఎస్సీ నోటిఫికేషన్ జారీకి వర్గీకరణ ఆర్డినెన్స్ మార్గం సుగమమైంది.

చాలా ఆనందంగా ఉంది



డీఎస్సీ కోసం కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్నాను. ఇప్పుడు ఆ కల నెరవేరింది. 2024లో టెట్ రాసి సిద్ధంగా ఉన్నా. ప్రభుత్వం నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకొని మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడం ఆనందంగా ఉంది.

-సౌర్ర శోభారాణి, చిన్నహంస

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



డీఎస్సీ నోటిఫికేషన్ రావడం చాలా సంతోషంగా ఉంది. చాలా ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం. ఇప్పుడు ప్రభుత్వం మెగా డీఎస్సీ విడుదల చేయడంతో నిరుద్యోగుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. పరీక్షకు సమయం ఉంది చక్కటి ప్రణాళికతో పరీక్ష రాయాలి.

-బత్తిని భాగ్యవతి, వజ్రపుకొత్తూరు

నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు



2008లో బీఈడీ పూర్తి చేశాను. ఇప్పటికి నాలుగు డీఎస్సీలు రాశాను. ఏడేళ్లుగా ఈ డీఎస్సీ కోసం ఎదురు చూస్తూ కళ్లకు కాయలు కాశాయి. ఇప్పుడు నోటిఫికేషన్ జారీ చేయడంతో నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నిండాయి. దీంతో మా కల నిజమైంది.

- పి.వెంకట్రావు, కొప్పలపేట, కోటబొమ్మాళి మండలం

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నా..



డీఎస్సీ కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నాను. ప్రస్తుత ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడం ఆనందంగా ఉంది. ప్రతిరోజు మెళియాపుట్టిలోని గ్రంథాలయానికి వచ్చి ప్రిపేర్ అవుతున్నాను. డీఎస్సీని కచ్చితంగా సాధించాలని పట్టుదలతో చదువుతున్నాను. గతంలో కోచింగ్ వెళ్లాను. ప్రస్తుతం గ్రంథాలయంలో ఎక్కువ పుస్తకాలున్నాయి.

-బాలు, కొసమాల

నిరుద్యోగుల కల నేరవేరనుంది



డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల ఆశ నెరవేనుంది. నాలుగేళ్లుగా నిరీక్షిస్తున్నాం. ఏటా డీఎస్సీ అని ప్రకటనలిచ్చినా కనీసం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. సీఎంగా చంద్రబాబు వచ్చిన తరువాత మెగా డీఎస్సీపై మొదటి సంతకం పెట్టడం ఆనందకరం. రెండేళ్లుగా ప్రిపేర్ అవుతున్న బీఈడీ, డీఈడీ అభ్యర్థులకు ఇది సువర్ణావకాశం. సద్వినియోగం చేసుకుంటాం.

-ఆరింగి పుష్పలత, హరిపురం

కొండను తవ్వింది వైసీపీ నేతలే..

● టీడీపీ నాయకులు

పలాస, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): సూది కొండను తవ్వి బోడికొండగా చేసింది వైసీపీ మాజీ మంత్రి అప్పలరాజు, ఆయన అనుచరులేనని, అయితే చలో సూదికొండ నిర్వహించడం దొంగే దొంగ అన్న చందంగా ఉందని టీడీపీ నాయకులు విమర్శించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం టీడీపీ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనలో కంకరను తవ్వి బోడి కొండను చేసింది ఎవరని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చి కేవలం తొమ్మిది నెలలే అవు తోందని, ఐదేళ్లలో మాజీమంత్రి కొండపై ఆక్రమణలు ఎందుకు తొలగించలేక పోయారన్నారు. పులిరాజు, కొండే మల్లేసు ఏ పార్టీకి చెందినవారని ప్రశ్నించారు. వీరితో పాటు మొత్తం కొండ చుట్టూ దొంగసంతకాలు చేసి పట్టాలు పొందిన చరిత్ర వైసీపీ నాయకులదేనన్నారు. మా పార్టీ నాయకులపై ఆరోపణలు చేసేవారు ముందుగా ఆ స్థలాలు ఎవరి వద్ద కొనుగోలు చేశారో గుర్తించాలని, మాజీ మంత్రి ఓటమి తరువాత నిజాలు చెప్పడం మరిచిపోయారన్నారు. కేంద్రీయ విద్యాలయం మంజూరు కాలేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, కలెక్టర్, కేంద్ర మంత్రి ఆదేశాల మేరకు 10 ఎకరాలు అవసరం ఉండడంతో ఆక్రమణల్లో ఉన్న భూములకు విముక్తి కలిగించామని, వైసీపీ నాయకుల భూములు కూడా ఇందులో ఉన్న అక్కసుతోనే మాజీ మంత్రి మతిలేని వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, పట్టణ కార్యదర్శి సప్ప నవీన్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, నాయకులు కొండే నర్సింహులు, గురిటి సూర్యనారాయణ, ఎం.నరేంద్ర (చిన్ని), జోగ మల్లి, అంబటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పూర్తిస్థాయిలో అందని రేషన్

● ఆందోళనలో లబ్ధిదారులు
● డీలర్లదే బాధ్యత అంటున్న అధికారులు

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): చౌక ధరల డిపో ద్వారా ఇస్తున్న రేషన్ బియ్యం ఈనెల పూర్తి స్థాయిలో అందకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. రెండు నెలల నుంచి కేవలం 80 శాతం బియ్యం మాత్రమే విడుదల అవుతుండడంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నట్లు డీలర్లు చెబుతున్నారు. దీంతో కొందరు లబ్ధిదారులకు బియ్యం ఇవ్వకపోవడంతో వారు డిపోలకు వెళ్లి డీలర్లను నిలదీస్తున్నారు. రేషన్ సర ఫరాకు గడువు ముగుస్తున్నప్పటికీ ఇప్పటికీ కొందరికి రేషన్ అందలేదని తెలుస్తోంది. గతనెల రికార్డుల్లో మిగులు బియ్యం ఉన్నట్లు కనిపిస్తున్నా గోడౌన్లలో మాత్రం ఆ మేరకు నిల్వలు లేకపోవడంతో ఈ ఇబ్బందులు ఎదురైనట్లు సమాచారం. వైసీపీ ప్రభుత్వంలో డిపోలు, నిల్వలపై తనిఖీలు లేకపోవడంతో డీలర్లు రికార్డుల్లో నిల్వలున్నట్లు చూపి గోడౌన్ నుంచి అక్రమంగా దారి మళ్లించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దీనిపై డిప్యూటీ తహసీల్దార్ బి.మురళీకృష్ణను వివరణ కోరగా లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో రేషన్ అందించాల్సిన బాధ్యత డీలర్లదేనని, ఏ డిపోలో నైనా పూర్తిస్థాయి బియ్యం అందించకుంటే ఫిర్యాదు చేసిన వెంటనే తనిఖీ చేసి చర్య లు తీసుకుంటామన్నారు. రికార్డుల్లో నిల్వ చూపించిన బియ్యం ఏమయ్యాయో ఆయా డీలర్లే సమాధానం చెప్పాలని అన్నారు.

పేదల భూములను లాక్కున్నారు

● మాజీ మంత్రి అప్పలరాజు



భూములు కోల్పోయిన వారితో మాట్లాడుతున్న మాజీ మంత్రి

పలాస, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): కేంద్రీయ విద్యాలయానికి అనుమతులే లేవని, కాని ఆ పేరుమీద సర్వే నెంబరు 51లో పేదల భూములు లాక్కున్నారని మాజీ మంత్రి, వైసీపీ నేత డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం చలో సూదికొండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ ప్రాంతంలో టీడీపీ నాయకుల ఆక్రమణలో ఉన్న భూములు అమ్మారని, వాటిని పేదలు కొనుగోలు చేస్తే ఆ భూములను ఆక్రమణల పేరుతో తొలగించారని, మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని విమర్శించారు. క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించగా ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది. ఆయన వెంట వైసీపీ నాయకులు పాల్గొనగా భూములు కోల్పోయిన వారు నామమాత్రంగా హాజరవడం చర్చనీయాంశంగా మారింది.

రైళ్లకు హాల్ట్ కల్పించాలని వినతి



కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హరిపురం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మందస రోడ్ (హరిపురం) రైల్వే స్టేషన్‌లో విశాఖ, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, ఇంటర్‌సిటీ, రాజారాణితో పాటు గుణుపూర్-కటక్ పాసింజర్ రైళ్లను నిలుపుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని కూటమి నేతలు కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ఆదివారం సోంపేటలో కలిసి వినతిపత్రం అందించారు. ఇప్పటికే ఈ సమస్యలపై రైల్వేమంత్రితో మాట్లాడానని, సంబంధిత అధికారులతో చర్చించానని, హాల్ట్‌కు కృషి చేస్తానని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో దుర్యోధన, తాతారావు, బి.గున్నయ్య, కొత్ర ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి అభినందన

టెక్కలి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): వరల్డ్ ఎకనమిక్ గ్లోబల్ యంగ్ లీడర్ జాబితా-2025లో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పేరును చేర్చినందుకు టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం జగతిమెట్ట జంక్షన్ వద్ద మండల టీడీపీ నాయకులు కలిసి ఆయనను అభినందించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి, నేతలు మట్ట సుందరమ్మ, మామిడి రాము, దల్లి ప్రసాద్‌రెడ్డి, దోని బుజ్జి, బగాది సునీల్, సుధీర్, గండేటి భీమారావు, పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

పోలాకి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఈదులవలస ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరంలో ఆరోతరగతి ప్రవేశానికి సోమవారం పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఉంటుందన్నారు. అభ్యర్థులు 9 గంటలకే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పరీక్షా ప్రవేశ పత్రాలను వెబ్‌సైట్‌లో పొందవచ్చన్నారు. హాల్‌టిక్కెట్‌ను వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకుని ఆధార్‌కార్డు, హాల్‌టికెట్‌లో ఫోటోలు లేనివారు రెండు పాస్‌పోర్టుసైజ్ ఫొటోలను తీసుకురావాలన్నారు. పదిహేను రోజుల్లోగా ఫలితాలు వెల్లడిస్తారన్నారు.

ఘనంగా ఉపనయనాలు

ఎల్.ఎన్.పేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): లక్ష్మీనర్సుపేట గ్రామంలో రాష్ట్ర ఒరియా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక ఉపనయనాలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు శివాజీ పాణిగ్రాహి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన పలువురు వటువులకు ఈ ఉపనయనాలు చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లతో హాజరుకావాలి

మెళియాపుట్టి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి ఏకలవ్య పాఠశాలలో 2025-26 సంవత్సరంలో ప్రవేశానికి ఎంపికైన విద్యార్థులు సోమవారం నుంచి 30వ తేదీ లోగా సర్టిఫికెట్లతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ ఎం.రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సర్టిఫికేట్లతో రాని విద్యార్థుల సీటు రద్దు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఎంపికైన విద్యార్థులకు సమాచారమిచ్చామన్నారు. ఇదిలా ఉండగా ఏకలవ్య పాఠశాలలో చదువుతున్న ఇంటర్ విద్యార్థులు ఆరుగురు ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌లో ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారని తెలిపారు.

తాబేళ్లకు ఏమైంది?

(ఐదో పేజీ తరువాయి)

మహిళను నెలవారీ జీతానికి నియమించి తాబేళ్ల సంరక్షణ బాధ్యతను అప్పగించింది. ప్రస్తుతం ఇక్కడ సుమారు 200 తాబేళ్లు ఉన్నాయి. పార్కులో ఉన్న తాబేళ్ల వివరాలను గ్రీన్‌మెర్సీ స్వచ్ఛంద సంస్థ ప్రతి నెలా ఆలయ అధికారులకు ఇవ్వాలి. కాగా.. కొంతమంది భక్తులు తాబేళ్లు తెచ్చి ఇక్కడ పార్కులో విడిచిపెడుతుంటారు. ఈ క్రమంలో తాబేళ్ల నిర్వహణ కష్టంగా ఉందని, వేరే దేవాలయానికి వాటిని అప్పజెప్పాలని నిర్వాహకులు చెబుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో భక్తులు ఆ తాబేళ్లను వెనక్కి తీసుకెళ్లకుండా.. ఆలయ ప్రాంగణంలోనే వదిలేసి వెళ్లిపోతున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో వాటికి సంరక్షణ కరువై కొన్ని మృతి చెందుతున్నట్టు సమాచారం. ఆదివారం శ్వేతపుష్కరిణి గోడ పక్కన కొన్ని తాబేళ్లు కాలిపోయి కనిపించడంతో భక్తులు ఆందోళన చెందారు. ఆలయ అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. తాబేళ్లను సంరక్షించాలని కోరారు.

● ఈ విషయమై తాబేళ్ల పార్కులో ఉన్న మహిళ వద్ద ప్రస్తావించగా.. 'తాబేళ్ల సంరక్షణను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. మాకు తొలుత 120 తాబేళ్లు అప్పగించారు. ప్రస్తుతం మా లెక్క ప్రకారం 187 వరకు ఉన్నాయి. భక్తులు ఇచ్చిన వాటితో కలిపి సుమారు 200 తాబేళ్లు పార్కులో ఉండవచ్చు. గత నెలలో ఒకటి, ఆదివారం రెండు తాబేళ్లు చనిపోయాయి' అని తెలిపింది.

● జిల్లా ఇన్‌చార్జి దేవదాయశాఖాధికారి వై.భద్రాజీ వద్ద ప్రస్తావించగా.. 'శ్రీకూర్మం దేవస్థానంలో తాబేళ్లు చనిపోతున్న విషయం మా దృష్టికి వచ్చింది. అక్కడి సిబ్బందితో మాట్లాడాం. ఈ విషయంపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. ఇటువంటి సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించామ'ని తెలిపారు.

పెంటూరులో శ్రమదానం

నందిగాం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పెంటూరు ఎస్సీవీధిలో అంబేడ్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రమదానం చేసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. రోడ్లను ఊడ్చారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వి.ధర్మారావు, టి.నర్సింహమూర్తి, కోదండరావు, బాబూరావు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్



పాతపట్నం: డ్యాన్స్ చేస్తున్న దృశ్యం

ఏసు పునరుత్థాన దినం సందర్భంగా ఆదివారం జిల్లాలోని పట్టణాలు, పలు గ్రామాల్లో క్రైస్తవులు ఈస్టర్ సండేని ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గీతాలాపనలు, డ్యాన్సులు చేశారు. పాస్టర్లు మాట్లాడుతూ.. మానవాళి పాప నివృత్తి కోసం మరణానంతరం తిరిగి లేచిన దేవుడు ఏసు అని అన్నారు. ఆయన బోధనలను ఆచరించాలని కోరారు. అలాగే పేదలకు వస్త్ర, అన్నదానం చేసి భక్తిని చాటుకున్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం



శ్రీకాకుళం కల్చరల్: ఆరాధన చర్చిలో గీతాలాపన





ఇచ్ఛాపురం, శ్రీకాకుళంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



పలాస రూరల్: హిమగిరి హెర్మన్ గ్రేస్ చర్చిలో ప్రార్థనలు